డ్రెయిన్ల పూడికతీత అధ్వానం

- రూ.20 లక్షలు హాంఫట్
- తూతూ మంత్రంగా పనులు
- చక్రం తిప్పిన జనసేన నేత


శివాలయం సెంటర్‌లో డ్రెయిన్‌లో తీసిన సిల్ట్ రోడ్డుపై వదిలేసిన దృశ్యం


బస్టాండ్ వద్ద మురుగుపారకుండా అధ్వానంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: మున్సిపాలిటీలో డ్రెయినేజీల పూడిక తీత పనులు అధ్వానంగా సాగాయి. పనులకు ఏకంగా రూ.20 లక్షలు ఖర్చు పెట్టారు. ఏదో చేసామన్నట్టుగా పనులుచేసి చూపించి దాదాపు రూ.15 లక్షల వరకూ మున్సిపల్ నిధులు స్వాహా చేసినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. చేసిన పనులకు రూ.5 లక్షలు కూడా ఖర్చుకాదని, మిగిలిన సొమ్ము మొత్తం కాజేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రెయిన్ పూడికతీత పనుల్లో జనసేన పార్టీకి చెందినో నేత చక్రం తిప్పినట్టుగా తెలిసింది. పట్టణంలో ప్రతిఏటా వేసవిలో మున్సిపాలిటీలోని ప్రధాన డ్రెయిన్సలో పూడికతీత పనులు చేపడతారు. ఈ ఏడాదికూడా పనులు మే నెల చివరిలో పనులు చేపట్టారు. మెయిన్‌రోడ్డు, ప్రకాశంరోడ్డు, స్టీమర్ రోడ్డు, పంజా సెంటర్ ప్రాంతాల్లోని మెయిన్ డ్రెయిన్స్ పూడికతీత పనులు చేపట్టారు. అప్పటికప్పుడు చేపట్టిన ఈ పనుల కాంట్రాక్ట్‌ను ఓ జనసేన నేత దక్కించుకుని తూతూ మంత్రంగా నిర్వహించారు.

ఎక్కడి మట్టి అక్కడే..

డ్రెయిన్స్‌లో పూడికతీత పనులు పైపైన నిర్వహించారు. మొత్తం పనులు కేవలం వారం రోజుల్లోనే ముగించారు. బయటకు తీసిన మట్టిని ఎక్కడబడితే అక్కడే అలాగే వదిలేశారు. దీంతో శివాలయం సెంటర్ వంటి ప్రాంతాల్లో ఇంకా డ్రెయిన్స్‌లో తీసిన మట్టి రోడ్డుమీదే ఉంది. దీంతో రోడ్డు పక్కన దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు పర్యవేక్షణా లోపం కారణంగా పూడికతీత పనులు సవ్యంగా సాగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే మే నెలాఖరున వర్షాలు పడడంతో చేసిన ఆ కాస్త పనులు ఉపయోగం లేకుండా పోయాయి. బయటకు తీసిన మట్టి తిరిగి వర్షాలకు డ్రెయిన్స్‌లోకి చేరడం గమనార్హం. పట్టణంలో అసలే డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగుపారుదల అంతంత మాత్రంగానే ఉంటుంది. దీనికి తోడు ప్రస్తుతం పూడికతీత పనుల సవ్యంగా సాగకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టిగా వర్షాలు పడితే డ్రెయినేజీలు పొరక రోడ్లు ముంపు బారినపడతాయని, మురుగునీరు రోడ్ల పైకి చేరి అనారోగ్య సమస్యలు కూడా వెంటాడతాయని భయపడుతున్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

నరసాపురం రూరల్: లక్షణేశ్వరం భారీ రక్షిత మంచి నీటి పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందించడంలో సమయపాలన లేకపోవడమే కాకుండా శుద్ధి చేసిన చేసిన నీటిని అందించడంలేదని ఎల్బీచర్ల గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ బొడ్డు అశేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ప్రజలకు తాగునీరు అందించే విషయలో సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని కుళాయిల ద్వారా తాగునీరు అందించే విషయంలో సమయపాలన లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అలాగే గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకును శుభ్రం చేసిన దాఖలాలు లేవని ఇటీవల కురిసిన వర్షాలకు ట్యాంక్ లోకి పురుగులు, దోమలు చేరి కుళాయిల ద్వారా వదిలే నీటితో పాటు వస్తున్నాయని, వీటివల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంక్‌కు సంబంధించి పైకి ఎక్కేందుకు మెట్లు పూర్తిగా పోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సిన బాధ్యత గ్రామపంచాయతీదే అయినప్పటికీ నిధులు లేవని అధికారులు చెప్పడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని కోరారు.

క్లుప్తంగా

వాసుకు టీబీఆర్ ఐకాన్ అవార్డు


టీబీఆర్ అవార్డు అందుకుంటున్న మద్దాల వాసు

పాలకొల్లు సెంట్రల్: రోటరీ క్లబ్ సభ్యుడు, మాంటిస్సోరిస్ స్కూల్ అధినేత మద్దాల వాసు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ వారి టీబీఆర్ ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. శనివారం తెలంగాణ సరస్వతి పరిషత్తు దేవులపల్లి రామానుజరావు కళామందిర్ హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు మధుకర్ స్వామి చేతులు మీదుగా మద్దాల వాసు టీబీఆర్ అవార్డును అందుకున్నారు. ఈ వివరాలను వాసు ఆదివారం విలేకరులతో పంచుకున్నారు. అనంతరం వేదికపై నృత్య ప్రదర్శన చేసిన హంసాంజలి చారిటబుల్ ట్రస్ట్‌కు వాసు రూ. 25 వేలు నగదును అందజేశానని వివరించారు.

సుపరిపాలనకు 11 సంవత్సరాలు


సమావేశంలో పాల్గొన్న శ్రీదేవి

పాలకొల్లు సెంట్రల్: భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనలో వికసిత భారతదేశపు అమృతకాల సేవ–సుపరిపాలన, పేదలసంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తవుతుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ హనుమాన్ కాలనీలో సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వికసిత్ భారత్ సంకల్ప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ యర్రంశెట్టి పద్మారావు, రావూరి సుధ, పట్టణ అధ్యక్షులు కొల్లికొండ ప్రసాద్, జక్కంపూడి కుమార్, కృష్ణవర్మ, రఘు, కబర్ది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే


ఆచంట పెదపేట రక్షణ సైన్యం చర్చిలో ఫాదర్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంట పెదపేటలోని రక్షణ సైన్యం చర్చిలో ఫాదర్స్‌డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో ఫాదర్స్‌ను ఘనంగా సత్కరించారు. సంఘ సేవకురాలు ప్రశాంతి మాట్లాడుతూ తండ్రి చెప్పే మాటలు వినాలన్నారు. వారికి విధేయులుగా ఉండాలన్నారు. తండ్రి శ్రమను, కష్టాన్ని గుర్తించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

క్రైస్తవ విశ్వాసుల నిరసన


ఫాదర్ గో బ్యాక్ అంటూ నిరసన తెలుపుతున్న క్రైస్తవ విశ్వాసులు

భీమవరం అర్బన్: గొల్లవానితిప్ప గ్రామంలో ఆర్‌సీఎమ్ చర్చి వద్ద ఫాదర్ గో బ్యాక్ అంటూ క్రైస్తవ విశ్వాసులు ఆదివారం నిరసన తెలిపారు. పలువురు సంఘ పెద్దలు మందా జాన్, మిరిపే విజయకుమార్, ముస్కూటి కుటుంబరావు, తాతపూడి రాంబాబు మాట్లాడుతూ 2021లో ఆర్‌సీఎమ్ చర్చికి ఫాదర్ జోషఫ్, రాజ్‌కుమార్ సేవ చేసేందుకు వచ్చారని అప్పటి నుంచి చర్చి పరిధిలో ఉన్న విచారణ సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గత కొంతకాలంలో చర్చిలో నూతనంగా వివాహం చేసుకున్న వారికి డిక్లరేషన్ ఇవ్వాలని నగదు కూడా అడిగి కొత్త నిబంధనలు తీసుకువస్తున్నారన్నారు. అంతేకాకుండా తమపై అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. సంఘ పెద్దలకు మద్దతుగా మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు వెళ్లడంతో ఆయనపై కేసు పెట్టినట్లు ఆయన తెలిపారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

నరసాపురం రూరల్: సీతారామపురం స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో ట్రిపుల్–ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అద్దాల సత్యనారాయణ డాక్టరేట్ సాధించారు. విశాఖపట్టణానికి చెందిన గీతం యూనివర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ పొందారు. సత్యనారాయణను ఆదివారం స్వర్ణాంధ్ర చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, ట్రెజరర్ కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్ అభినందించారు.

9 మంది జూదరుల అరెస్ట్

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.25,600 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం. నాగరాజు తెలిపారు.

రసధుని అధ్యక్షుడిగా కొట్టి


రసధుని సాహితీ సంస్థ నూతన కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రసధుని సాహితీ సంస్థ త్రైవార్షిక ఎన్నికలు ఏకగ్రీవంగా సాగాయి. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో 2025–2028 మూడేళ్లకు గానూ నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రసధుని అధ్యక్షుడిగా మూడవ పర్యాయం కొట్టి భాస్కరరావు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా యర్రంశెట్టి వంకటరత్నం, ట్రెజరర్‌గా ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా చేగొండి రంగారావు, వీవీఎస్ఎన్ రాజు, ర్యాలి విష్ణుమూర్తి, కార్యదర్శులుగా గడ్డం లక్ష్మీనారాయణ, ఎల్బీకే మూర్తిరాజు, మామిడిశెట్టి శ్రీనివాసరావుతో సహా పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వంగా నరసింహరావు, యర్రా అజయ్‌కుమార్‌లు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, సలహా మండలి సభ్యులుగా డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి, చేగొండి వివిసత్యనారాయణమూర్తి, డా. కెఎస్‌పిఎస్ వర్మ, మాటూరి నరసింహమూర్తి, మాడభూషి కృష్ణప్రసాద్, వంగా నరసింహరావు తదితరులు ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన రసధుని నూతన కమిటీ కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

డ్రెయిన్ షట్టర్‌కు అడ్డు తొలగించాలి


నారినమెరక వద్ద మట్లపాలెం మైనర్ డ్రెయిన్ షట్టర్‌కు అడ్డుగా ఉన్న మొండి గోడ

యలమంచిలి: నారినమెరక వద్ద మట్లపాలెం మైనర్ డ్రెయిన్ షట్టర్‌కు అడ్డుగా ఉన్న మొండిగోడను తొలగించాలని రైతులు కోరుతున్నారు. గంగడుపాలెం వద్ద ప్రారంభమైన మట్లపాలెం మైనర్ డ్రెయిన్ గంగడుపాలెం, మట్లపాలెం, నారినమెరక గ్రామాల మీదుగా రెండు కిలోమీటర్లు తర్వాత నారినమెరక వద్ద నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. సుమారు మూడు వందల ఎకరాల వ్యవసాయ భూమి ఈ డ్రెయిన్‌పై సాగు అవుతుంది. ఈ డ్రెయిన్‌పై నారినమెరక–వడ్డిలంక రోడ్డు వెళ్తుంది. ఈ రోడ్డుకు వంతెన ఉంది. వంతెన కింద నుంచి డ్రెయిన్‌లో మురుగునీరు వెళ్లడానికి షట్టర్ ఏర్పాటు చేశారు. వరదలు, అధిక వర్షాల సమయంలో మురుగునీరు డ్రెయిన్‌లోనికి వెళ్లడానికి ఈ షట్టర్ పైకి ఎత్తుతారు. మామూలు రోజుల్లో షట్టర్ మూసి ఉంటుంది. అయితే గతేడాది వరదల సమయంలో వంతెన గోడ పెద్ద అండగా పగిలి షట్టర్ ఎదురుగా పడిపోయింది. దీంతో షట్టర్ పైకి ఎత్తడానికి ఈ మొండిగోడ అడ్డుగా ఉంది. ప్రస్తుతం డ్రెయిన్‌లో తక్కువ నీరు ఉన్న నేపథ్యంలో అడ్డుగా ఉన్న మొండి గోడను తొలగించాలని రైతులు కోరుతున్నారు. అధిక వర్షాలు ప్రారంభమైతే మొండి గోడ మునిగిపోయి తీయడానికి ఇబ్బంది ఎదురవుతుందని చెబుతున్నారు. కాబట్టి ఇప్పుడే మొండిగోడను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో తపాలా శాఖ సర్వే


పెనుమంట్రలో గ్రామీణ తపాలా బ్యాంకింగ్ కార్యాలయం

పెనుమంట్ర: తపాలాశాఖలో బ్యాంకింగ్ సేవలను ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా మరింత విస్తృత పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా అన్ని సేవలను విస్తృతపరిచేందుకు గ్రామాలలో తపాలాశాఖ సర్వేను ప్రారంభించింది. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడానికి తపాలాశాఖ ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సర్వే కోసం తపాలాశాఖ మైసూర్ సాంకేతిక విభాగం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ హరికృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో తణుకు సబ్‌డివిజనల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యప్రకాష్ ఇప్పటికే సర్వే సిబ్బందికి అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో కచ్చితమైన సర్వే చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్వేలో తపాలాసిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆకుటుంబ యజమాని వివరాలతో పాటు సభ్యుల వివరాలను సేకరించి వారి వృత్తి, ఆదాయ వివరాలను కూడా సర్వేలో పొందుపర్చడమే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న తపాలా సేవల్లో గ్రామీణులకు ఇంకా ఎటువంటి సేవలు అందజేయాలనే వివరాలను ప్రజలనుంచి సర్వే ద్వారా సేకరించనున్నారు. ప్రతి గ్రామంలో ముందుగా సిద్ధ చేసుకున్న 20 కుటుంబాలను ఎంపిక చేసుకుని వివరాలను సర్వే ద్వారా పోస్టల్ సిబ్బంది నమోదు చేస్తారు. దీనికి అనుగుణంగా గ్రామాల్లో ఇప్పటికే అందుతున్న బ్యాంకింగ్ సర్వీసులతో పాటు వారికి ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయో? అనే దానిపై సర్వే నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు.

వృద్ధులను వేధించవద్దు

పెనుమంట్ర: ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది వృద్ధులు తమ కుటుంబ సభ్యుల నుంచి వేధింపులకు గురవుతూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని అలాంటి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెనుమంట్ర మండల సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల జగన్నాథరెడ్డి విజ్ఞప్తి చేసారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణా దినోత్సవాన్ని రోటరీ భవనంలో నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కర్రి సత్యనారయణరెడ్డి, కార్యదర్శి చిర్ల నరశింహరెడ్డి, జనరల్ సెక్రటరీ పోలవర్తి కృష్ణారావు, రిటైర్డు ఎస్సై కోనాల నర్సిరెడ్డి, మానవతా చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి


నడపన గోవింద రాజులు నాయుడు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని పాలకొల్లు మండల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులు నాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాళ్వా బకాయిలు రైతులకు ఇంకా అందలేదని, మరి సార్వా నారుమడులకు రైతులు ఎలా సిద్ధపడతారని ప్రశ్నించారు. సార్వా పెట్టుబడులకు రైతులకు డబ్బు ఎంతో అవసరమని తెలిపారు. సార్వా పనులను దృష్టిలో పెట్టుకుని రైతులకు చెల్లించాల్సిన దాళ్వా బకాయిలు వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. మొదట్లో దాళ్వా ధాన్యం కొనుగోలు చేయడానికి సంచులు ఇవ్వకుండా రైతు సేవా కేంద్రాల చుట్టూ తిప్పుకున్నారని, సంచులకు రైతులు గగ్గోలు పెడితే చిరిగిపోయిన సంచులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. తేమ శాతం పేరుతో మిల్లర్లు దోపిడి చేశారని తెలిపారు. ప్రస్తుతం నగదు ఇవ్వడానికి రైతులను ఏడిపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వృద్ధులను దూషించడం నేరం


సదస్సులో మాట్లాడుతున్న యోహాన్

భీమవరం: వృద్ధులను దూషించడం చట్టరీత్యా నేరమని, ముసలితనంలో తల్లిదండ్రులను చూడని పిల్లలపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే, గతంలో వారికి రాసి ఇచ్చిన ఆస్తుల దస్తావేజును రద్దు చేసి, ఆ ఆస్తిని తల్లిదండ్రులకే తిరిగి అప్పగించడం జరుగుతుందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దూషణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో చిన అమిరంలో ఉన్న శ్రీ స్వామి యోగీశ్వరానంద గిరి విశ్వ శాంతి వృద్ధుల సంక్షేమ కేంద్రంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రేషన్ కార్డు లేని కారణంగా వృద్ధాప్య పింఛన్ రానివారు సంబంధిత వీఆర్వో నుంచి సర్టిఫికెట్ తీసుకుని, ఆధార్ కార్డు నకలుతో జతచేసి మండల న్యాయ సేవా సంస్థకు అందజేస్తే వృద్ధాప్య పెన్షన్ అందేలా చేస్తారన్నారు. పిల్లల నుంచి తల్లిదండ్రులు మనోవర్తి పొందవచ్చన్నారు.

రాధ జీవితం మహిళలకు ఆదర్శం

పెనుగొండ: ఐద్వా మహిళా సంఘం నాయకురాలు కరుటూరి రాధ జీవితం మహిళలకు ఆదర్శనీయమని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేతా పద్మ, పొగాకు పూర్ణ అన్నారు. ఐద్వా సంఘ మహిళా నాయకురాలు కరుటూరి రాధ(85)కు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. చరమాంకం వరకూ అనేక ఉద్యమాల్లో పాల్గొని అంకిత భావంతో పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు నాయకురాలని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పీ మోహనరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్, గుత్తుల రంగారావు, కొండేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన డ్రాయింగ్ శిక్షణ


విజేతలకు బహుమతులు అందిస్తున్న కృష్ణమూర్తి

పాలకొల్లు సెంట్రల్: ది పాలకొల్లు ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరుకొండ బాలకృష్ణ జ్ఞాపకార్థం ఉచిత డ్రాయింగ్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆదివారం శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు నీలం రవి మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చామని, ముగింపు సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించామని వివరించారు. అనంతరం తటవర్తి కృష్ణమూర్తి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, ఎస్‌కెడీ రవికుమార్‌లు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రామబ్రహ్మం, సమతం చంద్రరావు, తాళ్ల బాలసుబ్రహ్మణ్యం, సోమాని శంకరం, జీఎస్ఎన్, కోరుకొండ సుబ్బారావు, పి.సాయికృష్ణ, కాసా కోటి వీరభద్రం పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కోసం దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: అర్హులై ఉండి తల్లికి వందనం పథకంలో సొమ్ములు బ్యాంకు ఖాతాల్లో జమ కాని వారు ఈ నెల 20లోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విచారణ అనంతరం ఈ నెల 30న ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ప్రకటించి, వచ్చే నెల 5న వారికి సొమ్ములు జమ చేస్తారని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా రేపాక


నూతన అధ్యక్షుడు ప్రవీణ్‌భానును అభినందిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: వాసవి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక బంగారు వారి శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా రేపాక ప్రవీణ్‌భాను, ప్రధాన కార్యదర్శిగా సనిశెట్టి లీలాభవన్నారాయణ, ట్రెజరర్‌గా బలభద్ర బాలరెడ్డియ్యలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యురాలు బంగారు ఉషారాణి, ఆర్యవైశ్య ఏపీ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ ట్రెజరర్ నుదురుపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మాటూరి నరసింహమూర్తి పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ సమస్యను పట్టించుకునేవారేరి?


బస్సు షెల్టర్‌లో పట్టపగలే మందుబాబులు విశ్రాంతి తీసుకుంటున్న దృశ్యం


మార్టేరు రోడ్డు బస్టాండ్‌లో చెట్లను తొలగించకుండా వదిలివేసిన విద్యుత్ శాఖ సిబ్బంది

పెనుమంట్ర: బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో సరైన బస్సు షెల్టర్ లేకపోవడం ఉన్న బస్సు షెల్టర్ మందుబాబులకు, ఆటో డ్రైవర్లకు నిలయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కూడలి సెంటర్‌గా ఉన్న బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో మార్టేరు రోడ్డులో ఒకటి, అత్తిలి రోడ్డులో ఒకటి, దాతల సహకారంతో బస్సు షెల్టర్ నిర్మించారు. అయితే ఈ బస్టాండ్లో నిర్వహణ లోపంతో దుకాణదారులు, ఆటో డ్రైవర్లు ఆక్రమణలతో అధ్వానంగా మారడంతో ప్రయాణికులు రోడ్డుమీదే నిలబడి బస్సులు కోసం నిరీక్షించాల్సి వస్తుంది. మార్టేరు రోడ్డులో బస్సు షెల్టర్ బల్లలపై పట్టపగలే మందుబాబులు నిద్రపోవడంతో మహిళా ప్రయాణికులు అక్కడ నిలబడటానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్సు షెల్టర్ విషయంలో స్థానిక పంచాయతీ అధికారులుగానీ, పోలీస్, ఆర్టీసీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో బస్సులు రోడ్ల పైనే నిలపడంతో ప్రయాణికులకు ప్రమాదాలు జరగడమేకాకుండా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. బ్రాహ్మణచెరువుల సెంటర్‌లో బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేసి, ఆక్రమణలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు బస్సు షెల్టర్ పక్కనే ఉన్న చెట్లను నరికి రెండు రోజుల పాటు వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. దీంతో ఆ చెట్లను స్థానికులే తొలగించి బస్సు షెల్టర్‌ను శుభ్రం చేశారు.

డీఎన్నార్ క్రీడా మైదానంలో యోగాంధ్ర


డీఎన్నార్ క్రీడామైదానంలో యోగాసనాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్, డీఎన్నార్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రోజూ ఒక అరగంట యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా బలపడి దైనందిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనవచ్చని కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు అన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పల్లారావు, కార్యదర్శి పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లప్ప కాలువ ప్రక్షాళన ఎప్పుడో?


పెనుగొండలో మురికి కూపంగా మారిన ఎల్లప్ప కాలువ

పెనుగొండ: ఎల్లప్ప కాలువ ప్రక్షాళన చేపట్టి ఆదుకోవాలంటూ రైతులు మొరపెట్టుకొంటున్నారు. పంట కాలువ కాస్తా మురికి కాలువగా మారిపోవడంతో కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. నరసాపురం ప్రధాన కాలువ నుంచి పెనుగొండలో ప్రధాన గ్రామం నుంచి నక్కల డ్రెయిన్ వరకూ ఎల్లప్ప కాలువ ప్రవహిస్తుంది. పెనుగొండ ప్రధాన గ్రామం మధ్య నుంచి ప్రవహించడం ఎల్లప్ప కాలువకు శాపంగా మారింది. గ్రామంలోని మురికి అంతా ఎల్లప్ప కాలువలోకే ప్రవహిస్తుండడంతో మురుగుకాలువగా మారింది. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ కాలువలోకే చేరుతుంది. దీంతో రెండు దశాబ్దాలుగా ప్రక్షాళన కోసం రైతాంగం నీటి పారుదల శాఖాధికారులకు, ప్రజా ప్రతినిధులకు పదేపదే విజ్ఞప్తి చేస్తూ మొర పెట్టుకుంటున్నారు. పదేళ్ల క్రితం ఆధునికీకరణ పనులు చేపట్టినా సగంలోనే నిలిపివేశారు. దీంతో ఎల్లప్ప కాలువ ప్రక్షాళన కలగానే మిగిలిపోయింది. దీంతో ఎల్లప్ప కాలువ మురికి కాలువగానే ఉండిపోయింది. సాగు మొదలవుతున్న తరుణంలో కాలువను ఇప్పటికైనా ప్రక్షాళన చేయాలని కోరతున్నారు.